


# నీ కల్చరూ నా కల్చరూ

**మా** అమ్మాయికి ఒక యూనివర్సిటీలో సీటు వచ్చింది. పాపం, తను ఇంకో ఇద్దరు అమ్మాయిలతో రూమ్ షేర్ చేసుకోవాలి.

"అమ్మడూ, నీకు సాలె పురుగులన్నా, పాములన్నా భయం కదా! మళ్ళీ నీకస్తమానూ పురుగులతో టీ, 'ఫ్రైడే 13' జేసన్ తోటీ కలలు వస్తాయి. కాబట్టి, సింగిల్‌రూమ్ తీసుకోవద్దు. అనునయంగా చెప్పాను.

"అయ్యో, అది చాలా కష్టమే. ఏంచేస్తాం? ఎలా

## జెయుబివి ప్రసాద్



గో అలాగ సర్దుకుంటాను" ఎప్పుడూ తిన్నగా ఒప్పుకుంది లేదు.

"ఇది డబ్బు గురించి సమస్య అనుకోకు. అంటే ఎక్కువ డబ్బు కట్టాల్సి వస్తుందని సింగిల్ రూమ్ తీసుకోవద్దనడం లేదు. నువ్వు క్షేమంగా, భద్రంగా వుండాలంతే.

నన్ను పిసినారి అనుకుంటుందేమోనని నా భయం.

నా వైపొకసారి చూసి ఏమీ అనకుండా వూరుకుంది.

మా అమ్మాయిని యూనివర్సిటీ హాస్టల్‌లో దింపడానికి పదిహేను మంది పట్టే వేన్ తీసుకోవాల్సి వచ్చింది. ఎందుకంటే మాతోపాటు మా కుటుంబ మిత్రులు కూడా వస్తామన్నారు సాయంగా. మా అమ్మాయితో కలుపుకొని మేం నలుగురం కాకుండా, ఇంకో ముగ్గురు అంకుల్సూ, వారి ఇద్దరు చిన్న అమ్మాయిలూ.

**ప్రవాసాంధ్ర కథ**

ఒక అంకుల్ పిల్లలు రాలేదులెండి. మొత్తం ప్రయాణం ఇంతమందితో సరదాగా జరిగిపోయింది.

మేం ఆ వూరు చేరుకొనేసరికి అర్ధరాత్రి అయిపోయింది. ఆ రాత్రికి ఒక హోటల్‌లో వున్నాం.

మర్నాడు పొద్దున్నే మా కుటుంబ సభ్యులంతా ఆరు గంటలకే లేచేసాం. ఎనిమిది గంటలకల్లా యూనివర్సిటీలో వుండాలని ప్లాను. తొమ్మిది గంటలకి యూనివర్సిటీవాళ్ళు హాస్టల్‌లో వుండే పిల్లలకి రూమ్ తాళాలు ఇస్తారు. షేరు చేసుకునే రూముల్లో ఎవరు ముందర వెళితే వాళ్ళకిష్టం అయిన బెడ్ తీసుకోవచ్చు.

మా ఆవిడ అక్కయ్య కొడుకు వచ్చి మమ్మల్ని యూనివర్సిటీకి తీసుకువెళ్ళాడు. మిగిలిన ముగ్గురు అంకుల్సూ, ఇద్దరు అమ్మాయిలూ ఇంకా నిద్ర లేవలేదు.

గంటసేపు లైన్లో వుండడం ఏమీ కష్టమనిపించలేదు. ఏ నుంచి ఎమ్‌తో ఇంటిపేర్లు మొదలయ్యే పిల్లలకి ఒక లైనూ, ఎన్ నుంచి జెడ్‌తో ఇంటిపేర్లు మొదలయ్యే పిల్లలకి ఇంకో లైనూ. పేరెంట్సందరం కలిసి గోలగోలగా మాట్లాడుకోవడం మొదలుపెట్టాం.

మొదట మా పిల్లల గొప్పతనం, మా గొప్పతనం చెప్పుకున్నాం.

ఆ తర్వాత మా పిల్లలు మమ్మల్ని ఎలా కాల్చుకు తింటారో, మేం ఎంత సహనం చూపిస్తామో జాలిగా చెప్పుకున్నాం.

హాస్టల్‌లో చేరబోయే పిల్లలు మాత్రం తల్లితండ్రుల మాటలకి ఇబ్బందిగా మొహాలు పెట్టుకుని నుంచున్నారు.

టైమలా గడిచిపోయింది.

మేం మా లైన్‌లో మొట్టమొదటి వాళ్ళమయినా, ఇంకోలైను చూసే అమ్మాయి ముందరే మొదలుపెట్టి, వేగంగా పని చెయ్యడంవల్ల, ఆ ఇంకో లైనులో వున్న ఇద్దరమ్మాయిలకి రూమ్ తాళాలు తొందరగా వచ్చాయి. ఆ అమ్మాయిలెవరూ మా అమ్మా

యి రూమ్మేట్లు కాకూడదని మేం ప్రార్థించుకున్నాం.

మా అమ్మాయికి తాళం ఇచ్చిన వెంటనే ముందర నేను పరిగెత్తాను రూమ్ వైపు. మా అబ్బాయి నా వెనకాలే వాళ్ళక్కకోసమని పరిగెత్తాడు. మా ఆవిడ మాత్రం హుందాగా నడిచింది రూమ్‌వైపు. మా అమ్మాయి వాళ్ళమ్మకి దారిచూపించింది.


నేను మొట్టమొదటగా తాళం తీసి, కిటికీ దగ్గర వున్న బెడ్డు మీద కూర్చున్నాను. నాతోపాటు మా అబ్బాయి కూడా విజయగర్వంతో మంచంమీద కూర్చున్నాడు.

ఆ రూమ్ ఎనిమిదో అంతస్థులో వుంది. బెడ్డు పక్క కిటికిలోంచీ బయట అంతా బాగా కనిపిస్తోంది.

మా అమ్మాయి సంతోషం వెలిబుచ్చనప్పటికీ, లోపల్లోపల సంతోషించిందని నాకు తెలుసు.

ఒక అరగంట గడిచాక, మా పటాలం అంతా వచ్చేసింది. వాళ్ళింకో అరగంటలో రూమ్ సర్దేసారు. కంప్యూటర్‌ని ప్రింటర్‌తోటీ, వీడియో కెమెరా తోటీ, స్పీకర్లతోటీ, మైకు తోటీ కనెక్టు చేసేసారు. ఇంటర్‌నెట్ కనెక్షన్ కూడా పెట్టేసారు. ఇద్దరు చిన్న అమ్మాయిలూ బెడ్డు సర్దేసారు. మేం నలుగురం మాత్రం పని చేస్తున్నట్లు చాలా యాక్షన్ చేసాం.

కొంతసేపు పోయాక, మిగిలిన ఇద్దరు రూమ్మేట్లూ, వారి తల్లి తండ్రులూ, వారి చెల్లెళ్ళూ, వారి తమ్ముళ్ళూ వచ్చేసారు. వాళ్ళు కూడా వాళ్ళ పిల్లలకి సర్దడం మొదలుపెట్టారు. ఇంకా చాలాసేపు సర్దుతూనే వున్నారు. ఈ లోపల మేమంతా పరిచయాలు చేసేసుకున్నాం.



వాళ్ళలో ఒకమ్మాయికి అస్తమానూ ఎక్సర్ సైజ్ చెయ్యడం అంటే ఇష్టం. ఇంకో అమ్మాయికి అస్తమానూ బయట తిరగడం అంటే ఇష్టం.

బయట తిరిగే అమ్మాయి చాలా తెలివైందట. కొంచెంసేపు మాత్రమే హోమ్‌వర్క్ చేయడానికీ, చదువుకోవడానికీ రూమ్‌లో వుంటుందంట. మిగిలిన టైమంతా బయటే తిరుగుతూ వుంటుందట.

ఎక్సర్‌సైజ్ అమ్మాయి మాత్రం ఎక్కువసేపు హోమ్ వర్క్ చేసుకుని, అత్తెసరు మార్కులతో సంతోషంగా వుంటుందంట.

అనుకున్నట్లుగానే మా అమ్మాయిని ఒక్కత్తినీ వదిలి రావాలంటే కష్టం వేసింది. ఇంకా అనుకున్నట్లుగానే మా ఆవిడ బాగా ఏడిచింది. మిగిలిన వాళ్ళందరం విచారంగా మొహాలు పెట్టాం. జీవితంతో పాటు మనమూ సాగాలిగా!

మేం మా అల్లరీ, సతాయించే, కష్టపెట్టే, సణుగుతూ వుండే, కోపం తెప్పించే, చంపుతూ వుండే, దెబ్బలాడుతూ వుండే, అయినా ఆపేక్షగా వుండే అమ్మాయిని అక్కడ ఒంటరిగా వదిలేసి బరువెక్కిన హృదయంతో ఇంటిమొహం పట్టాం.

కాలం ఎవరికోసమూ ఆగకుండా స్పీడుగా సాగిపోయింది.

ఈ లోపల మా అమ్మాయి కొన్నిసార్లు ఇంటికి సెలవులిచ్చినప్పుడల్లా వచ్చింది. అందరికీ అలవాటయిపోయింది.

మా కుటుంబ మిత్రుడొకాయన ఆ యూనివర్సిటీ వున్న వూరికి తరుచుగా ఆఫీసు పనిమీద వెడుతూ వుండేవాడు. మా ఆవిడ అతనితో క్రమం తప్పకుండా ఇంట్లో చేసిన తిండి డబ్బాల్లో పంపేది. మా అమ్మాయికి అక్కడ కేంటీన్‌లో పెట్టే తిండి నచ్చేది కాదు. ఇంటి దగ్గర వున్నప్పుడు ఏ తిండినయితే తిట్టుకుంటూ తినేదో, ఆ తిండినే అక్కడ ఇష్టంగా తినేది. ఆ రూమ్మేట్లూ, పక్క రూమ్ పిల్లలూ ఆ తిండిని మెచ్చుకుంటూ తినేవాళ్ళు, పాపం.

మా అమ్మాయిని వేసవి కాలం సెలవులకి ఇంటికి తీసుకువచ్చే టైమ్ వచ్చేసింది. ఒక్కడినే కారులో వెళ్ళి, అమ్మాయినీ, తన సామాన్లనీ తీసుకురావాలనీ ప్లాను వేసుకున్నాను.

ఆ మర్నాడే ప్రయాణం అన్న రోజు రాత్రి వచ్చింది ఆ ఫోన్ కాల్.

"నాన్నా, నాన్నా నీకో విషయం చెప్పాలి, కానీ చెప్పలేను" గొంతుకలో ఒక రకమయిన ఫీలింగ్‌తో అంది. నేను నవ్వాను ఆ మాటలకి. తనకి కోపం వచ్చేసింది.

"నవ్వద్దు నాన్నా. నువ్వు ఇక్కడకి వచ్చాక మాట్లాడతాను. ఇప్పుడు మా రూమ్‌లో అందరూ వున్నారు. నేను వివరంగా ఏమీ మాట్లాడలేను ఇప్పుడు" అంది తనే మళ్ళీ.

"సరే కానీ ఏమిటా విషయం?" కుతూహలంగా అడిగాను.

"మా రూమ్‌లో ఒక ఫైటింగ్ జరిగింది. నీకు తర్వాత చెప్తానులే"

"నువ్వు బాగానే వున్నావా?" కొంచెం వర్రీగా అడిగాను.

"నేను బాగానే వున్నాను. మేం బాగా వాదించుకున్నాం. నువ్వు రేపిక్కడకి వచ్చినప్పుడు చెప్తానుగా అన్నీ వివరంగా" వాగ్దానం చేసింది.

"సరే జాగ్రత్తగా వుండు. ఆఖరి రెండురోజులలో అనవసరంగా ఎవరితోనూ గొడవలు పెట్టుకోకు" పెద్దవాడిగా కొంచెం బుద్ధిచెప్పడానికి ప్రయత్నం చేసాను.

"సరే, సరే ఇంక వుంటాను" ఫోన్ పెట్టేసింది.

ఇంకేమీ చెయ్యలేక నిట్టూర్చాను.

సంగతి కోసం అక్కడవరకూ వెళ్ళే అవసరం లేకపోయింది. మర్నాడు ఆఫీసులో వున్నప్పుడు వచ్చింది ఫోన్‌కాల్. మా అమ్మాయి రూమ్ బయటనుంచీ మాట్లాడింది.

"ఆ ఎక్సర్‌సైజ్ అమ్మాయి వల్లనే గొడవంతా అయింది" ఉపోద్ఘాతం ఇచ్చింది.

"వివరంగా అంతా చెప్పు" నా దగ్గర కావలసినంత సహనం వుంది.

** ** **

మా అమ్మాయి చెప్పసాగింది.

ఎక్సర్‌సైజ్ చేసే అమ్మాయికి అందంగా వుండే ఒక బాయ్‌ఫ్రెండ్ దొరికాడు. వాడు కూడా అదే హాస్టల్‌లో వుంటాడు. వీళ్ళిద్దరూ ఎప్పుడూ కలిసే తిరుగుతూ వుంటారు. వాళ్ళిద్దరి పేర్లూ కలిపి వాళ్ళకొక నిక్‌నేమ్ కూడా పెట్టాం. దానివల్ల మాకేమీ ప్రాబ్లమ్ రాలేదు.

ఆ బయట తిరిగే అమ్మాయి నిజంగా గ్రేట్. చాలా తక్కువ టైమ్ స్పెండ్ చేస్తుంది చదువుమీద. అయినా మంచి గ్రేడ్స్ వస్తాయి.

నెమ్మదిగా ఆ ఎక్సర్‌సైజమ్మాయీ, ఆ బాయ్‌ఫ్రెండూ మాకు సమస్యలు తేవడం మొదలుపెట్టారు. మేం రూమ్‌లో వున్నప్పుడు వాళ్ళు అసభ్యంగా ప్రవర్తించడం మొదలుపెట్టారు. మేం లేనప్పుడు వాళ్ళ గోల మేం పట్టించుకున్నది ఎలాగూ లేదు. వాళ్ళ ప్రవర్తన చాలా అసహ్యంగా వుండేది. మేం రూమ్‌లోకి వచ్చాక కూడా వాళ్ళ చెత్త ప్రవర్తనని ఆపేవాళ్ళు కాదు. చాలాసార్లు మేమే ఇబ్బందిపడి రూమ్‌లోంచి బయటకి పోయి, మళ్ళీ చాలాసేపు పోయాక వచ్చేవాళ్ళం.

ఈ దరిద్రం ఎక్కువ కాలం భరించలేకపోయాం. మా ఇద్దరికీ వొళ్ళు మండిపోతూ వుండేది. పక్క రూముల్లో వుండేవాళ్ళకి కూడా ఈ గోల తెలుసు. ఈ ఎక్సర్‌సైజ్ పిల్లకి తన వెనకాల మిగతావాళ్ళు ఏం మాట్లాడుకునేదీ తెలిసి చావలేదు.

ఆరోజు ఆ బయట తిరిగే పిల్లా, నేనూ రూమ్‌కి వచ్చేసరికి వీళ్ళిద్దరూ తమ అసభ్య ప్రవర్తనలో మునిగి వున్నారు. మమ్మల్ని చూసాక కూడా వాళ్ళు ఆపలేదు. మాకు బాగా కోపం వచ్చేసింది. తలుపు గట్టిగా వేసి, మేమిద్దరమూ బయటికి వెళ్ళిపోయాం.

చాలాసేపు పోయాక సీరియస్ మొహాలతో రూమ్‌కి వచ్చాం. ఆ ఎక్సర్‌సైజమ్మాయికి ఏదో జరిగిందని తెలిసింది గానీ ఏం జరిగిందో అర్థం అవలేదు.

మేం మా బెడ్స్‌మీద కూర్చున్నాం.

"మీ ఇద్దరూ నామీద ఎందుకో కోపంగా వున్నట్లు తోస్తోంది నాకు. నావల్ల ఏం తప్పు జరిగిందో తెలియదు. గానీ నాకు మీరిద్దరూ అంటే చాలా ఇష్టం అని తెలుసుకోండి"ఎక్సర్‌సైజమ్మాయి అంది.

ఆ అమ్మాయి అంత కృత్రిమంగా మాట్లాడ్డం ఇంక భరించలేకపోయాను. ఇంక ఈ పిల్ల పని అయింది అనుకున్నాను.

"నువ్వూ, నీ బాయ్‌ఫ్రెండూ నలుగురిలో ఎలా ప్రవర్తించాలో నేర్చుకోవడం మంచిది" ఎర్రబడ్డ మొహంతో అన్నాను.

"మా ప్రవర్తన గురించి మాట్లాడ్డానికి నువ్వెవరు?" ఎదురు తిరిగింది ఆ పిల్ల.

"మేముండగా నువ్వు సరిగా ప్రవర్తించకపోతే, మేమెవ్వరమో చాలా బాగా తెలిసేట్లు చేస్తాం" వదలదల్చుకోలేదు ఈసారి.

"అవును. ఈ చెత్తని మేమింక సహించలేకపోయాం. నిన్ను నువ్వు కంట్రోల్ చేసుకోవాలి" బయట తిరిగే అమ్మాయి సపోర్టిచ్చింది.

"మీరలా ఎలా మాట్లాడగలుగుతున్నారు? మేమేం తప్పు చేసాం?" గట్టిగా అరిచింది ఎక్సర్‌సైజ్ పిల్ల.

"ఇదిగో తల్లీ! రేపు నాకు ఫైనలెగ్జాం వుంది. నేను ఇంక పడుకోవాలి. ఇప్పుడు ఆ విషయం గురించి మాట్లాడ్డం నాకిష్టం లేదు. నన్ను నిద్ర పోనియ్యి" బయట తిరిగే పిల్ల దుప్పటి ముసుగెట్టింది తన బెడ్ లైటాఫ్ చేసి.

నేనూ నా బెడ్ మీదకి వెళ్ళి, నా బెడ్ లైటాఫ్ చేసుకుని, దుప్పటి ముసుగెట్టాను.

కొన్ని క్షణాలయ్యాక ఏదో పెద్దచప్పుడు వినిపించింది. ఏం జరిగిందో అర్థం కాలేదు. కొంచెం భయం వేసింది కూడా. వెంటనే లేచి లైట్ వేసాను.

ఆ ఎక్సర్‌సైజమ్మాయి ఒక కప్పుని గట్టిగా గోడకేసి కొట్టింది కోపంతో. బద్దలైన కప్పు ముక్కలు నేల అంతా పడి వున్నాయి.

తెల్లబోయాను కాసేపు. తెల్లబోవటం అయిపోయాక రూమ్‌లోంచి బయటికి వెళ్ళసాగాను.

"ఇదిగో రూమ్‌లోంచి బయటికి వెళ్ళద్దు, ప్లీజ్. మనం డిస్కస్ చేద్దాం" అకస్మాత్తుగా బతిమాలుతున్నట్లు అంది.

"కుదరదు, సారీ. ప్రస్తుతానికి బయటికి పోవాలి. ఇంకేమీ మాట్లాడలేను ఇప్పటికి".

పక్కనే వున్న వేరే రూమ్‌లోకి వెళ్ళాను. అక్కడున్న అమ్మాయిలతో నా కథని చెప్పడం మొదలుపెట్టాను. వాళ్ళు ప్రశ్నలు అడుగుతున్నారు.

ఎక్సర్‌సైజమ్మాయి అక్కడికి కూడా వచ్చేసింది. నన్ను వదలడం లేదు. మళ్ళీ తన గోల చెప్పసాగింది.

"నువ్వూ, నీ బాయ్‌ఫ్రెండూ నలుగురిలో ఎలా ప్రవర్తించాలో నేర్చుకోవడం మంచిది" ఎర్రబడ్డ మొహంతో అన్నాను.

ఈ లోపల బయట తిరిగే అమ్మాయి ఇంక నిద్ర పోలేక అక్కడికి వచ్చింది.

"ఏవమ్మో, డిస్కస్ చేద్దామన్నావు కదూ? సరే, డిస్కస్ చేద్దాం, రా" గట్టిగా అంది బయట తిరిగే అమ్మాయి.

మేం ముగ్గురం ఆ రూమ్‌లోంచి బయటకి వెళ్ళి, అక్కడున్న లాబీలో సోఫా మీద కూర్చున్నాం.

"చూడూ, నువ్వూ, నీ బాయ్‌ఫ్రెండూ మా సమక్షంలో చాలా అసభ్యంగా ప్రవర్తిస్తున్నారు. ఇంక మేం సహించి వూరుకోలేం. మీ ప్రైవసీలో మీరెలా వుంటారో మాకనవసరం. అది మీ హక్కు. కానీ పబ్లిక్‌లో మాకు సంకటంగా వుంటుంది. మేం రూమ్ నీతో షేర్ చేసుకుంటున్నాం" వీలైనంత సున్నితంగా చెప్పాను.

"నాకు తెలుసు. నేనూ మారడానికే ప్రయత్నిస్తున్నాను. కానీ, మీ ఏసియన్స్ కల్చర్ మా అమెరికన్ల కల్చర్ కన్నా వేరుగా వుంటుంది. అందుకే నీకర్థం కావట్లేదు. నా ప్రవర్తనలో తప్పేమీ లేదు. అది మా అమెరికన్లకి అలవాటే. మా ఆప్యాయతనీ, మా ప్రేమనీ మేం పబ్లిక్‌లో ఇలా ప్రకటించుకుంటాం. ఇది అసభ్యత కాదు" తన తప్పుడు తర్కంతో తను వాదించడానికి ప్రయత్నించింది.

కాసేపు నేనేమీ మాట్లాడలేకపోయాను.

"సరే నేనూ నీలాగే అమెరికన్ని కదా! నా కల్చర్ కూడా నీ కల్చర్ లాంటిదే కదా! నేను కూడా అదే చెప్తున్నాను. మీ అసభ్య ప్రవర్తనని మేమింక భరించలేం. దీనికీ, కల్చర్‌కీ సంబంధం లేదు. నీ విషయంలో నీకు స్వాతంత్ర్యం వున్నట్లే మా విషయాల్లో మాకు స్వాతంత్ర్యం వుంది. మా స్వాతంత్ర్యం ఎక్కడ మొదలవుతుందో, అక్కడ నీ స్వాతంత్ర్యం పూర్తవుతుంది. మేం రూమ్‌లో వున్నప్పుడు మీరు అసభ్యంగా ప్రవర్తించకూడదు" బయట తిరిగే అమ్మాయి చాలా స్పష్టంగానూ, చాలా గట్టిగానూ చెప్పింది.



దాంతో ఎక్సర్‌సైజమ్మాయి ఏడవడం మొదలుపెట్టింది.

అవును, అర్థం అయింది. కానీ నేను నా ప్రవర్తనని మార్చుకోవడానికి ప్రయత్నిస్తున్నాను. మీ ఇద్దరి స్నేహం నాక్కావాలి" చాలా జడ్డిగా అంది ఆ ఎక్సర్‌సైజమ్మాయి.

తలని రెండు చేతుల్తోనూ పట్టుకుని కూర్చున్నాను. ఇంకేం చెప్పాలి ఈ పిల్లకి?

"నీకు మా స్నేహం కావాలంటే, నువ్వు నీ హార్మోన్సుని కంట్రోల్ చేసుకోవాలి. సరేనా?" బయట తిరిగే అమ్మాయి చాలా స్పష్టంగా చెప్పింది.

ఎక్సర్‌సైజమ్మాయి నివ్వెరపోయి మా మొహాలవైపే చూడసాగింది.

** ** **

మా అమ్మాయి కథ పూర్తి చేసింది.

అమ్మో.. ఎంత పెద్ద కథో! చాలా బరువైన కథ కూడా. నేను వెంటనే ఏమీ మాట్లాడలేదు.

కొంతసేపు పోయాక, "ఆఖరికి ఏం జరిగింది" అడిగాను.

"ఏమీ లేదు. ఆ అమ్మాయి అస్తమానూ అదే చెప్తుంది. ఆఖరికి విసుగుపుట్టి మేమా విషయం చర్చించడం వదిలేసాం" మా అమ్మాయి పూర్తి చేసింది వివరణ.

నేను యూనివర్సిటీ చేరేసరికి రాత్రి 11.00 అయింది. బయట తిరిగే అమ్మాయి తన ఇంటికి వెళ్ళిపోవడంతో, నేను ఆ అమ్మాయి బెడ్డు మీద పడుకున్నాను ఆ రాత్రికి. 12.30 తర్వాత, ఆ అమ్మాయి బాయ్‌ఫ్రెండ్ వచ్చాడు గదిలోకి. ఈ పిల్లలు అర్ధరాత్రైనా ఓ పట్టాన పడుకోరు లాగుంది. మా అమ్మాయి ఆ అబ్బాయిని పరిచయం చేసింది. హలోలు చెప్పుకున్నాం. వాడెళ్ళి ఆ ఎక్సర్‌సైజమ్మాయికి 'గుడ్‌నైట్' చెప్పాడు. ఆ పిల్ల వాడిని కాసేపు తన దగ్గర వుండమంది. ఆ పిల్ల కొంచెం జలుబు చేసి బాగా కష్టపడిపోతోంది. ఆ పిల్లాడు ఆ పిల్లకి మందులు ఇచ్చాడు. ఆ పిల్లడు బెడ్డు సరి చేసాడు. అలారం మర్నాటి పొద్దున్నకి పెట్టాడు. ఆ పిల్లకి మర్నాటి ఫైనల్ పరీక్షకి లేవడానికి. ఆ పిల్లకి దుప్పటి కప్పి, మంచంమీద పక్కనే కూర్చున్నాడు.

వీళ్ళేం అఘాయిత్యం మొదలుపెడతారోనని నాకు భయం పట్టుకుంది. వాళ్ళవైపు ఒకసారి తీక్షణంగా చూసాను. నా బెడ్డుమీద ఇబ్బందిగా కదలసాగాను. వాళ్ళు ఏదో మొదలు పెట్టేలోపలే వాళ్ళ నాపాలని నా తాపత్రయం.

మొహం సీరియస్‌గా పెట్టుకుని వాళ్ళవైపే చూడసాగాను. వాళ్ళు నా వైపొకసారి చూసి, వాళ్ళ మొహాలు వాళ్ళొకసారి చూసుకున్నారు. వాళ్ళిద్దరికీ కొంచెం భయం వేసినట్టుంది. తెచ్చి పెట్టుకున్న దగ్గుతో బెడ్డు మీద మూడు సార్లు ఇబ్బందిగా కదిలాను. మా అమ్మాయి నా సంగతి గ్రహించి, నవ్వు కష్టపడి ఆపుకుంటోంది. ముక్కూ, మూతి నలుపుకుని నవ్వుని ఆపుకుంటోంది.

"సరే, గుడ్‌నైటందరికీ. ఇంక లైట్లు ఆర్పేసి, తలుపేసుకుని పడుకుందామా ప్లీజ్?" పొద్దున్నే లేవాలి కూడా" గొంతూ పెద్దది చేసి అడిగాను.

వాళ్ళిద్దరూ దడుసుకున్నారు. ఆ పిల్లాడు ఆ పిల్లకి తల వూపుతూ 'గుడ్‌నైట్' చెప్పి, బయటకి వెళ్ళిపోయాడు. నేను తలుపు లోపల వేసి, లైట్లు ఆర్పేసాను.

ఆ రాత్రంతా మా అమ్మాయి నా గురక వల్లా, ఆ ఎక్సర్‌సైజమ్మాయి తుమ్ములూ, చీదుళ్ళ వల్లా నిద్రే సరిగా పోలేదు.

మర్నాడు కారులో మా ప్రయాణం మొదలుపెట్టాక, మేమా విషయం గురించి మాట్లాడుకున్నాక, మా అమ్మాయి నవ్వడం మొదలుపెట్టింది రాత్రి నా ప్రవర్తనకి. ఆ నవ్వు ఇంటికి వెళ్ళే వరకూ ఆగలేదు. ●